## గురుకుల ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు 20 వరకు గడువు

నల్లగొండ, జనవరి 11 : 2024-25 విద్యా సంవత్సరానికి గానూ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఉమ్మడి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఈ నెల 20 వరకు పొడగించినట్లు సాంఘిక సంక్షేమ జిల్లా కో ఆర్డినేటర్ ఆకుల భిక్షమయ్యగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

**సీఓఈ కళాశాల దరఖాస్తుకు 15 వరకు గడువు..**

సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఓఈ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15 తేదీ వరకు గడువు పెంచినట్లు భిక్షమయ్యగౌడ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ వెల్ఫేర్ సీఓఈ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో విద్యాబోధన చేస్తూ ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్, సీఏ, క్లాట్ పరీక్షల కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హులు 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



సర్పంచ్‌లను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

## ప్రభుత్వ భూములను కాపాడాలి

- జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, జనవరి 11: మండలంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను కాపాడాలని జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ కార్యాలయంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురైతే సహించేది లేదని హెచ్చరించారు. త్వరలో ప్రభుత్వ భూముల సర్వే నిర్వహించాలని సూచించారు. మండలంలో విద్యుత్ సరఫరా సరిగా లేదని, మిషన్ భగీరథ పైప్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని పలు గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకురాగా వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సంక్షేమ పథకాలు అందించాలని, అలాగే మండల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం ఈ నెలఖారున పదవీ విరమణ పొందనున్న సర్పంచ్‌లను సత్కరించి మెమెంటోలు అందజేసి సన్మానించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, ఎంపీడీఓ యాదగిరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలి

- జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు

సూర్యాపేట, జనవరి 11 : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు అన్నారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో 1వ(ఆర్థిక),7వ (పనులు), 2వ (గ్రామీణాభివృద్ధి), 4వ(విద్య, వైద్యం)స్టాండింగ్ కమిటీల సమావేశాలు జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎక్కడ కూడా నీటి ఎద్దడి ఉండదన్నారు. పైప్‌లైన్ సమస్యలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని, ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. ఏప్రిల్ నాటికి టార్గెట్‌కు మించి పనులు జరుగాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ సురేశ్‌కుమార్, జడ్పీటీసీలు పుల్లారావు, దావుల వీరప్రసాద్‌యాదవ్, జగ్యా, కృష్ణకుమారి, దామోదర్‌రెడ్డి, పద్మ, నర్సయ్య పాల్గొన్నారు.




స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు

# లోక్‌సభ పోరుకు సమాయత్తం

## నేడు హైదరాబాద్‌కు గులాబీ సేన

- భువనగిరి పార్లమెంట్ స్థానంపై సమీక్ష
- దిశా నిర్దేశం చేయనున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హాజరుకానున్న ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు
- 16న నల్లగొండ లోక్‌సభ స్థానంపై రివ్యూ






**త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. నియోజకవర్గాల వారీగా నేతలు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తూ సమాయత్తమవుతున్నది. అందులో భాగంగా శుక్రవారం భువనగిరి పార్లమెంట్ స్థానంపైన, సంక్రాంతి తర్వాత 16న నల్లగొండ స్థానంపైన సమీక్షకు సిద్ధమైంది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వేదికగా జరిగే సమీక్షల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గాల వారీగా సమీక్ష చేస్తూ లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపైనే ప్రధానంగా చర్చించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. నేటి సమీక్ష సమావేశానికి భువనగిరి లోక్‌సభ పరిధిలోని ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులంతా హాజరుకానున్నారు.**

నల్లగొండ ప్రతినిధి, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల ఫలితాల్లోని లోటుపాట్లపై విశ్లేషిస్తూనే లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీగా సిద్ధం కావడానికి బీఆర్ఎస్ సమాయత్తమవుతున్నది. ఉమ్మడి జిల్లా పరిధిలో భువనగిరి, నల్లగొండ లోక్‌సభ స్థానాలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నియోజకవర్గాల వారీగా శుక్రవారం భువనగిరి, 16న నల్లగొండ స్థానాల వారీగా ముఖ్యనేతలతో సమావేశాలకు షెడ్యూల్ ప్రకటించింది. అందులో భాగంగానే నేడు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భువనగిరి లోక్‌సభ స్థానంపై సమీక్షా సమావేశం జరుగనున్నది.

### హాజరుకానున్న నేతలు

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగే భువనగిరి లోక్‌సభ స్థానంపై సమీక్షా సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌లతోపాటు లోక్‌సభ స్థానం పరిధిలోని జిల్లా పార్టీల అధ్యక్షులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, రాష్ట్ర, జిల్లా కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు, ఇతర ముఖ్యులు పాల్గొననున్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సగటును 100 మంది చొప్పున మొత్తం ఏడు స్థానాల నుంచి 700 మంది వరకు హాజరుకానున్నారు. వీరందరికి యువ నేత కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలో భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం, జనగామ అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం జనగామలో మాత్రమే బీఆర్ఎస్ పార్టీ గెలుపొందింది. మిగతా ఆరు చోట్ల కాంగ్రెస్ పార్టీ గెలిచింది. ఇక ఇదే సమయంలో 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరిలో స్వల్ప తేడాతో కాంగ్రెస్ గెలుపొందింది. అయినా సరే భువనగిరి లోక్‌సభ స్థానంపైన ఈ సారి గులాబీ జెండా ఎగురవేయాలన్న లక్ష్యంతో ఎన్నికలకు సిద్ధం కానున్నది. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం అంతటా బలమైన పార్టీ యంత్రాంగం ఉంది. గత ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిషలు కష్టపడ్డారు. ప్రజల్లో కనిపించిన మార్పు సంకేతంతో అనూహ్య ఫలితాలు చవిచూడాల్సి వచ్చింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన వ్యతిరేక ఫలితాలపై సమీక్షిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసేలా దిశానిర్దేశం చేయనున్నారు.

### 16న నల్లగొండ పై..

సంక్రాంతి అనంతరం ఈ నెల 16వ తేదీన నల్లగొండ లోక్‌సభ స్థానంపైన తెలంగాణ భవన్‌లో సమీక్షా సమావేశం జరుగనున్నది. ఇందులోనూ భువనగిరి తరహాలోనే ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలంతా పాల్గొననున్నారు. నల్లగొండ లోక్‌సభ స్థానం పరిధిలో నల్లగొండ, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి మినహా మిగతా పార్టీ అభ్యర్థులంతా ఓటమి పాలయ్యారు. ఓటమిపై పార్టీ పరంగా జరిగిన లోటుపాట్లను చర్చిస్తూనే నల్లగొండ లోక్‌సభ స్థానంలో గెలుపుపై దృష్టి సారించనున్నారు. అందుకు అనుగుణంగా ఎన్నికలపై వ్యూహరచన చేయనున్నారు.



జాన్‌పహాడ్ దర్గా వద్ద పార్కింగ్ ఏర్పాటుకు ప్రదేశాలను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే, పక్కన ట్రైనీ ఎస్పీ రాజేశ్‌మీనన్, కోదాడ డీఎస్పీ ప్రకాశ్

## జాన్‌పహాడ్ ఉర్సుకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ రాహుల్ హెగ్డే
- ఉత్సవాలకు ఏర్పాట్ల పర్యవేక్షణ

పాలకవీడు, జనవరి12 : ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే జాన్‌పహాడ్ దర్గా ఉర్సుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. గురువారం మండలంలోని జాన్‌పహాడ్ దర్గాలో ఉత్సవాలకు ఏర్పాట్లను ట్రైనీ ఎస్పీ రాజేశ్‌మీనన్‌తో కలిసి పర్యవేక్షించారు. నేరేడుచర్ల-జాన్‌పహాడ్, దామరచర్ల-జాన్‌పహాడ్ రహదారుల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పార్కింగ్ ప్రదేశాలను, జాన్‌పహాడ్ దర్గాలో రహదారులను పరిశీలించారు. సఫాయి బావి, చందల్ ఖానాతోపాటు దర్గా లోపలి ప్రదేశాలను పరిశీలించారు. దర్శనానికి వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా బారికేడ్లను ఏర్పాటు చేయాలని, క్యూలైన్ అమలు చేయాలని ఆదేశించారు. మహంకాళీగూడెంలోని పుష్కరఘాట్‌ను పరిశీలించారు. ఉర్సుకు వచ్చే భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించనున్నందున పుష్కరఘాట్ వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. జాన్‌పహాడ్ ఉర్సు విజయవంతానికి పోలీస్ శాఖ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటుందని, 500 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ చేపడుతామని చెప్పారు. అంతకుముందు దర్గా ముజావర్ జాని ఎస్పీకి సంప్రదాయ స్వాగతం పలికారు. సైదులు బాబా సమాధులపై ఎస్పీ చాదర్ కప్పి ప్రార్థనలు చేశారు. ఆయన వెంట జిల్లా ట్రైనీ ఎస్పీ రాజేశ్ మీనన్, కోదాడ డీఎస్పీ ప్రకాశ్, హుజుర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి, పాలకవీడు ఎస్ఐ లింగయ్య ఉన్నారు.

## డీఈఈ సెట్ రెండో విడుత కౌన్సెలింగ్ షెడ్యూల్

రామగిరి, జనవరి 11 : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఈ-సెట్)కోర్సు 2023-25 బ్యాచ్‌లో చేరేందుకు రెండో విడుత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విద్యాశాఖ విడుదల చేసినట్లు నల్లగొండ డైట్ ప్రిన్సిపాల్ కె.నర్సింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న మొదటి విడుత (ఫేజ్-1)లో సర్టిఫికెట్స్ పరిశీలన చేయించుకోవాలని తెలిపారు. ఈ నెల 18 నుంచి 22 వరకు కళాశాలల ఎంపిక కోసం వెబ్ ఆప్షన్స్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. సీటు వచ్చిన విద్యార్థులు ఈ నెల 26 నుంచి 29 వరకు కళాశాలల్లో ఫీజు చెల్లించి రిపోర్టు చేయాలని సూచించారు.

# పండుగ ప్రయాణం సాఫీగా సాగేలా..

- సంక్రాంతి వేళ హైవేపై ఏర్పాట్లు
- పంతంగి టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేక చర్యలు
- ప్రతి 20 కిలోమీటర్లకు ఒక క్రేన్.. 30 కిలోమీటర్లకు అంబులెన్స్
- ఫాస్టాగ్ లేకుంటే ట్రాఫిక్ ఇక్కట్లు




పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

చౌటుప్పల్, జనవరి 11 : సంక్రాంతి పండుగ నేపథ్యంలో 65వ నంబర్ జాతీయ రహదారి రద్దీగా మారనున్నది. ఈ నెల 12 నుంచి 17 వరకు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడంతో హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లేందుకు ఉమ్మడి జిల్లావాసులతోపాటు, ఏపీ ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో చౌటుప్పల్ పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫాస్టాగ్‌ను తప్పనిసరి చేస్తూ సూచనలిస్తున్నారు. ఫాస్టాగ్ ఉంటే అర నిమిషంలో టోల్‌ప్లాజా దాటవచ్చు.. లేదంటే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సిందే.. ఫాస్టాగ్ లేకున్నా, పని చేయకున్నా టోల్‌ప్లాజా వద్ద రెట్టింపు రుసుము చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. కావున వాహనదారులు ముందే ఫాస్టాగ్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఫాస్టాగ్ లేని వారి కోసం నగదు చెల్లింపు కోసం ప్రత్యేక కౌంటర్ ఉంటుందని, ఇక్కడ నాలుగైదు నిమిషాల సమయం పడుతుందని తెలిపారు.

### ట్రాఫిక్ నియంత్రణకు..

చౌటుప్పల్ మండల వ్యాప్తంగా ట్రాఫిక్ నివారించేందుకు ఇద్దరు ట్రాఫిక్ సీఐలు, ముగ్గురు ట్రాఫిక్ ఎస్ఐలు, 30మంది ట్రాఫిక్ సిబ్బందిని కేటాయించారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ నియంత్రణకు జీఎమ్మార్ 30 మంది ఆదనపు సిబ్బందిని నియమించింది. వారు టోల్‌ప్లాజాతోపాటు చౌటుప్పల్ మండల పరిధిలోని దండు మైలారం, దండు మల్కాపురం, ఖైతాపురం, ధర్మోజిగూడెం, అంకిరెడ్డిగూడెం, పంతంగి, గుండ్లబావి క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ప్రతి 20 కిలోమీటర్లకు ఒక క్రేన్, 30 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులకు ఏదైనా ఇబ్బంది ఉంటే 100లేదా వాట్సాప్ నంబర్ 8712662111ను సంప్రదించాలని భువనగిరి ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. వాహనదారులకు ఏ సమస్య ఉన్నా 1033 నంబర్‌ను సంప్రదించాలని జీఎంఆర్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

### అద్దంకి.. నార్కట్‌పల్లి రహదారిపై..

మాడ్గులపల్లి : సంక్రాంతి సందర్భంగా అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై గల టోల్ ప్లాజా వద్ద ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని టోల్‌ప్లాజా మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వాహనాలకు ఫాస్టాగ్ తప్పనిసరి ఉండాలని, లేకుంటే రద్దీ పెరుగుతుందని చెప్పారు.




నల్లగొండ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

## ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**నేటి నుంచి ఈ నెల 15 వరకు సంక్రాంతి సర్వీసులు**

**నల్లగొండ రీజియన్ పరిధిలో 400 బస్సుల ఏర్పాటు**

నల్లగొండ సిటీ, జనవరి11 : సంక్రాంతికి వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించేందుకు ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి నల్లగొండలోని ఏడు డిపోల నుంచి 400 బస్సులను వివిధ ప్రాంతాలకు తిప్పేందుకు సిద్ధం చేసింది. నేటి నుంచి ఈ నెల 15 వరకు ఇవి అందుబాటులో ఉండనున్నాయి. హైదరాబాద్ నుంచి అధిక రద్దీ ఉండనున్నందున ఆ మార్గానికి ఎక్కువ సర్వీసులు కేటాయించారు. ప్రధానంగా ఈ నెల 12, 13, 14 తేదీల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని, దానికి అనుగుణంగా బస్సులు నడిచేలా ప్రణాళికలు రూపొందించామని నల్లగొండ రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు.

### మహాలక్ష్మి పథకంతో పెరుగనున్న రద్దీ

ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఇటీవల ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దాంతో పండుగకు మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగనున్నది. సాధారణ రోజుల్లోనూ రద్దీ ఉంటుండడగా పండుగకు ప్రయాణం కొంత కష్టమే. దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నదని, జాగ్రత్తగా ప్రయాణాలు సాగించాలని అధికారులు సూచిస్తున్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నల్లగొండకు ఉత్తమ ర్యాంకులు

**రాష్ట్ర స్థాయిలో 3వ, జాతీయ స్థాయిలో 92వ ర్యాంకులు**

**హర్షం వ్యక్తం చేసిన మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు**

నీలగిరి, జనవరి 11 : స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో నల్లగొండ మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో 3వ, జాతీయ స్థాయిలో 92వ ర్యాంక్ సాధించింది. గురువారం మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రిలీజ్ చేసిన ర్యాంకుల్లో లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణాల్లో జాతీయ స్థాయిలో 446 పట్టణాలు పోటీ పడగా నల్లగొండకు 92వ ర్యాంక్ వచ్చింది. అలాగే తెలంగాణ రాష్ట్రంలో 11 పట్టణాలు పోటీ పడగా గ్రేటర్ హైదరాబాద్‌కు ప్రథమ, కరీంనగర్‌కు ద్వితీయ, నల్లగొండకు తృతీయ ర్యాంకులు వచ్చాయి. నల్లగొండ మున్సిపాలిటీకి ఉత్తమ ర్యాంకులు రావడంపై మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ర్యాంక్ వచ్చేందుకు సహకరించిన పట్టణ ప్రజలు, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆదర్శ పాఠశాలల్లో దరఖాస్తులు

- నేటి నుంచి ఫిబ్రవరి 22 వరకు స్వీకరణ
- ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో 32 పాఠశాలలు

*గత బీఆర్ఎస్ సర్కార్ విద్యకు ప్రాధాన్యం కల్పించి ప్రైవేట్, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. అందులో భాగంగా ఆదర్శ పాఠశాలల్లో(మోడల్ స్కూల్స్) ఆంగ్ల బోధనతో విద్య అందించడమే కాకుండా ఉన్నత ప్రమాణాలతో ఉచిత విద్య అందిస్తున్నది. దాంతో వాటిల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తుండడంతో ప్రవేశాలకు గట్టి పోటీ నెలకొంది. 2024-25 విద్యా సంవత్సరంలో ఆయా పాఠశాలల్లో సీట్ల భర్తీకి విద్యాశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. శుక్రవారం నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.*

రామగిరి, జనవరి 11 : కార్పొరేట్ పాఠశాలల కంటే మెరుగైన వసతులతో ఆదర్శ పాఠశాలల్లో ఉచితంగా ఉత్తమ బోధన అందిస్తున్నాయి. అన్ని వసతులతో కూడిన శాశ్వత భవనాలు, క్రీడామైదానాలు, ఆటల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, కమ్యూనికేషన్ సిల్స్‌లో శిక్షణ, పూర్తి స్థాయిలో సిబ్బంది, సీసీ కెమెరాలతో పర్యవేక్షణతోపాటు పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలతో ఆదర్శంగా నిలుస్తున్నాయి.

### వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ..

రోజువారీ తరగతులతోపాటు భవిష్యత్‌లో విద్యార్థులు స్థిరపడేలా వృత్తి విద్యా కోర్సుల్లో సైతం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. యానిమేషన్, బ్యుటీషియన్, మైక్రో ఇరిగేషన్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, హెల్త్‌కేర్, వెల్‌నెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, బ్యాంకింగ్ వంటి వివిధ రకాల కోర్సులను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.




### 32 ఆదర్శ పాఠశాలలు..

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 32 ఆదర్శ పాఠశాలలున్నాయి. వీటిలో నల్లగొండ జిల్లాలో 17, సూర్యాపేట జిల్లాలో 9, యాదాద్రి భువనగిరి జిల్లాలో 6 పాఠశాలలు పని చేస్తున్నాయి. ఈ పాఠశాలల్లో ఆరో తరగతిలో వందశాతం సీట్లతోపాటు 7 నుంచి 10వ తరగతిలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యింది. కాగా, నేటి నుంచి ఫిబ్రవరి 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఏప్రిల్ 7న రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగానే ఆయా పాఠశాలల్లో సీట్ల కేటాయింపు చేస్తారు. www.telanganms.cgg.gov.inలో ప్రవేశ పరీక్షకు ఓసీ విద్యార్థులు రూ.150, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. హాల్‌టికెట్స్ సైతం ఇదే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

### విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ఆదర్శ పాఠశాలల్లో సీట్ల భర్తీకి పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు ఉచితం యూనిఫామ్, పాఠ్య, నోటు పుస్తకాలు అందచేస్తారు. కార్పొరేట్‌కు దీటుగా బోధన సాగుతుండడంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-భిక్షపతి, డీఈఓ, నల్లగొండ